

విద్యుత్తు వెలుగుల్లో అయోధ్య రామాలయం ధగధగలు

# అయోధ్యలో రామోత్సవం

## అంగరంగ వైభవంగా రామ్‌లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేడుక

అయోధ్య, జనవరి 22: కోట్ల మంది శతాబ్దాల కల నెరవేరింది.. బాలరాముడి రూపంలో శ్రీరాముడు అయోధ్యకు చేరాడు.. ఆ దివ్య రూపాన్ని చూసిన కోట్ల మంది భక్తులు జై శ్రీరాం అంటూ తన్మయత్వంతో పులకించిపోయారు.. సోమవారం పండితులు నిర్ణయించిన శుభముహూర్తాన బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. సోమవారం మధ్యాహ్నం 12.29 గంటలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరిగిన ఈ కార్యక్రమానికి 8 వేల మంది ప్రముఖులు హాజరయ్యారు. ముందుగా స్వామి వారికి అలంకరించే వెండి గొడుగు, అరుణ వర్ణ వస్త్రంతో గర్భగుడిలోకి ప్రవేశించిన ప్రధాని మోదీకి వేద పండితులు సంకల్పం చెప్పి 84 సెకన్ల అభిజిత్ ముహూర్త సమయంలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహింపజేశారు. అనంతరం విగ్రహం ముందు ప్రధాని సాష్టాంగ నమస్కారం చేశారు. ఆయన వెంట ఉత్తరప్రదేశ్ గవర్నర్ అనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ ఉన్నారు. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ముగిశాక ప్రధాని మోదీ తన 11 రోజుల దీక్షను విరమించారు. ఆయనకు రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యుడు గోవింద్ దేవ్ గిరి మహారాజ్ తీర్థాన్ని తాగించి, ఉపవాస దీక్షను విరమింపజేశారు. కాగా, బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఆర్మీ హెలికాప్టర్ల ద్వారా ఆలయంపై పూల వర్షం కురిపించారు.



అయోధ్యలోని బాల రాముడి దివ్యరూపం

### ఇక నుంచి కొత్త శకం: మోదీ

అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠతో కొత్త శకం ప్రారంభమైనదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సోమవారం ప్రాణ ప్రతిష్ఠ అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో జై సియా రామ్ అంటూ ప్రసంగాన్ని మొదలు పెట్టిన ఆయన మాట్లాడుతూ.. 'మన రాముడు వచ్చేశాడు. ఈ కార్యం ఆలస్యమైనందుకు క్షమించాలని రాముడిని వేడుకుంటున్నా. జనవరి 22, 2024.. ఇది తేదీ మాత్రమే కాదు. కొత్త కాల చక్రానికి ప్రతీక. వందల ఏండ్ల తర్వాత కూడా ఈ తేదీని ప్రజలు గుర్తు పెట్టుకుంటారు. ఈ శుభ ముహూర్తాన వచ్చే వెయ్యేండ్ల భారత్ కోసం పునాది వేశాం. ఆలయ నిర్మాణంతోనే ఆగిపోకూడదు. పటిష్ఠ, భారీ ఆధ్యాత్మిక భారత్‌ను నిర్మించాలి. ఈ రోజు రాముడి భక్తులంతా పట్టరాని సంతోషంలో ఉన్నారు. అయోధ్య ప్రజల ఆనందానికి అవధుల్లేవ్. స్వాతంత్ర్యం వచ్చాక కూడా దశాబ్దాల పాటు న్యాయపోరాటం చేశాం. ఇన్నేండ్లకు మన స్వప్నం సాకారమైంది. ఎన్నో బలిదానాలు, పోరాటాలు, త్యాగాల తర్వాత మన రాముడు మళ్లీ అయోధ్యకు వచ్చాడు. మన రామ్ లల్లా ఇక టెంట్‌లో ఉండాల్సిన అవసరం లేదు. దివ్యమందిరంలో కొలువుదీరాడు. ఈ శుభ గడియల్లో ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నా. శ్రీరాముడి ఆశీస్సులతో ఈ ఆధ్యాత్మిక కార్యంలో పాలుపంచుకోవటం గొప్పగా భావిస్తున్నా. ఈ సందర్భాన దేశమంతా దీపావళి జరుపుకుంటున్నది' అని తెలిపారు. రామమందిర నిర్మాణంలో ఎన్నో అడ్డంకులు ఎదురయ్యాయని, చివరికి న్యాయమే గెలిచిందని వెల్లడించారు.

### కుబేర్ తిలలో పూజలు


అయోధ్యలోని రామమందిర పరిసరాల్లో ఉన్న కుబేర్ తిల శివాలయాన్ని ప్రధాని మోదీ దర్శించుకొన్నారు. శివలింగానికి జలాభిషేకం చేశారు. అనంతరం జటాయు విగ్రహాన్ని ఆవిష్కరించారు. పురాతన ఆలయంగా పేరొందిన ఈ గుడిని కూడా శ్రీరామ్‌జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్ అభివృద్ధి చేస్తున్నది.

### తరలివచ్చిన ప్రముఖులు

సాధువుల దగ్గరి నుంచి బిజినెస్ టైకూన్ల వరకు, సినీ, రాజకీయ ప్రముఖులు బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి తరలివచ్చారు. ప్రముఖ వ్యాపార వేత్తలు రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ, ప్రముఖ నటులు అమితాబ్ బచ్చన్, రజనీకాంత్, చిరంజీవి, రామ్‌చరణ్, కత్రినాకైఫ్, విక్కీ కౌశల్, రణ్‌బీర్ కపూర్, ఆలియాభట్, రోమిత్‌శెట్టి, రాజ్‌కుమార్ హిరానీ, ఆయుష్మాన్ ఖురానా, మాధురి దీక్షిత్ దంపతులు సహా అనేక మంది రాముడిని దర్శించుకొన్నారు.

### అతిథులకు అయోధ్య పుస్తకం.. తులసి మాల.. రాముడి స్కార్ఫ్

అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులకు అయోధ్య ధామం-దేవుడి నిలయం పేరు కలిగిన పుస్తకం, లోహపు దీపం, తులసి మాల, రాముడి పేరు కలిగిన స్కార్ఫ్ కానుకలుగా అందించారు. తులసీ మాల ఉత్తర ప్రదేశ్ పర్యాటకం ట్యాగ్‌లైన్ కలిగి ఉంది. ఇవన్నీ ఆలయ గ్రాఫిక్ చిత్రం, అయోధ్య బాలరాముడి ఫొటో కలిగిన సంచిలో పెట్టి ఇచ్చారు. ఈ కానుకలతో పాటు నాలుగు లడ్డూలు, చిప్స్, నువ్వుల మిఠాయి(రేవ్డీ), జీడిపప్పు, ఎండు ద్రాక్ష కలిగిన పెట్టెను కూడా అందించారు.



రామమందిరం వద్ద పూలను వెదజల్లుతున్న భారత వైమానిక దళ హెలికాప్టర్



ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న ఢిల్లీ వాసులు

## కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు

ప్రతి హిందువు నోటా జై శ్రీరాం.. ప్రతి ఆలయంలో రామ నామ జపం.. ప్రతి ఇల్లూ భక్తి పారవశ్యం.. ఉదయం నుంచే గుడులకు దారులు.. ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. ఇంటి బయట దీపాల వెలుగులు.. వెరసి దేశమంతా ఆధ్యాత్మిక భావంతో ఓలలాడింది. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. ప్రాణప్రతిష్ఠ సమయంలో అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనగర్‌లోని శంకరాచార్య ఆలయం, జీలం నది ఒడ్డున ఉన్న హనుమాన్ టెంపుల్ సహా కేరళలోని త్రిస్సూర్ శ్రీరామస్వామి ఆలయం, ఇలా ప్రతి చోటా గుడి గంటల చప్పుళ్లే. కేరళ గవర్నర్ ఆరిఫ్ ఖాన్ తిరువనంతపురంలోని రమాదేవి ఆలయంలో పూజలో పాల్గొన్నారు. జార్ఖండ్‌లోని 51 వేలకు పైగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంషెడ్‌పూర్‌లో 18,500 చదరపు అడుగుల్లో రాముడి రంగోలీ వేశారు. ఢిల్లీలోని 70 నియోజకవర్గాల్లో శోభాయాత్ర, సుందరకాండ పారాయణం చేశారు. తెలంగాణ, ఏపీ, మధ్యప్రదేశ్, బెంగాల్, రాజస్థాన్, బీహార్.. అన్ని రాష్ట్రాల్లో భక్తులు రామ జపం చేశారు. విదేశాల్లోనూ హిందూ భక్తులు సంబురాలు చేసుకున్నారు. వాషింగ్టన్ డీసీ వీధుల్లో కాషాయ జెండాలు పట్టి, జైశ్రీరాం అంటూ నినదించారు. దాదాపు 70 దేశాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఒక్క మాటలో చెప్పాలంటే.. అయోధ్యలో రాముడి ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుంటే ప్రతి ఊరిలో జరుగుతున్నట్టే భావించిన భక్త జనం ఆధ్యాత్మికతలో మునిగిపోయింది.



సోమవారం బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని అయోధ్యలోని సరయు తీరాన దీపాలను వెలిగిస్తున్న భక్తులు

## భూమ్మీద అత్యంత అదృష్టవంతుడిని నేనే

### రామ్‌లల్లా విగ్రహ శిల్పి అరుణ్ యోగిరాజ్ ఆనందం



అయోధ్య: ఈ భూమ్మీద తన కంటే అదృష్టవంతుడు ఎవరూ లేరని రామ్‌లల్లా విగ్రహ రూపకర్త అరుణ్ యోగిరాజ్ అమితానందం వ్యక్తం చేశారు. విగ్రహాన్ని చెక్కేందుకు ఆ రాముడే తనను ఎంపిక చేసుకొన్నాడని భావిస్తున్నట్టు పేర్కొన్నారు. కర్ణాటకలోని మైసూర్‌కు చెందిన శిల్పి యోగిరాజ్ మలచిన విగ్రహాన్నే అయోధ్య ఆలయంలో ప్రతిష్ఠించిన విషయం తెలిసిందే. రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠకు హాజరైన ఆయన సోమవారం ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ కష్ట సమయాల్లో తనను, తన కుటుంబాన్ని రాముడే కాపాడుతుంటాడని తాను ఎల్లప్పుడూ అనుకొంటానని పేర్కొన్నారు. 'బాలరాముడి విగ్రహాన్ని అందగా, కచ్చితత్వంతో చెక్కేందుకు తాను ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాను. ఈ రోజున తాను మలచిన విగ్రహం అయోధ్య ఆలయంలో ప్రతిష్ఠాపన అయింది. ఈ రోజు నా జీవితంలో అత్యంత గొప్ప రోజు' అని యోగిరాజ్ ఆనందం వ్యక్తంచేశారు.

## జనకపురిలో ఆనందోత్సాహాలు

### నేపాల్‌లో జనకపుర్‌ధామ్‌లో వేడుకలు

కాఠ్మాండ్, జనవరి 22: అయోధ్య రామాలయ ప్రారంభోత్సవ వేడుకలు నేపాల్‌లోని మాదేశ్ ప్రావిన్స్ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. శ్రీరాముడి భార్య సీతాదేవి జన్మస్థలంగా భావిస్తున్న జనకపుర్‌ధామ్‌కు సోమవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాగితపు జెండాలు, రంగు రంగుల దీపాలతో జనకపురి వీధులు కళకళలాడాయి. గ్రామస్తులు 1.25 లక్షల దీపాల్ని వెలిగించారు. ఇక్కడి సీతాదేవి ఆలయానికి (జనకపుర్‌ధామ్) తరలివచ్చిన భక్తుల జై శ్రీరామ్ నినాదాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అలాగే మాదేశ్ ప్రావిన్స్‌లో ప్రజలు పెద్ద ఎత్తున ఈ వేడుకలు జరుపుకున్నారు. తమ ఇండ్ల వద్ద దీపాల్ని వెలిగించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో భజనలు, కీర్తనలతో సీతారాముల్ని కొలిచారు. దేవాలయాల్ని సందర్శించి పూజలు చేశారు.

## అయోధ్య కొత్త మసీదు నిర్మాణం మే నెలలో

### 'ముహమ్మద్ బిన్ అబ్దుల్లా మసీదు'గా నామకరణం

అయోధ్య: అయోధ్యలో కొత్త మసీదు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. రంజాన్ మాసం వచ్చే మే నెలలో మసీదు నిర్మాణాన్ని ప్రారంభిస్తామని ఈ ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్న ఇండో-ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షుడు హాజి అర్ఫత్ షేక్ వెల్లడించారు. మహ్మద్ ప్రవక్త పేరున ఈ మసీదుకు 'ముహమ్మద్ బిన్ అబ్దుల్లా మసీదు' అని నామకరణం చేశారు. అయోధ్య రామజన్మ భూమి వివాదం కేసులో సుప్రీంకోర్టు కొత్త మసీదు కోసం బాబ్రీ మసీదు కూల్చిన స్థలానికి 25 కిలోమీటర్ల దూరంలో స్థలాన్ని కేటాయించింది.



## ఉమా, సాధ్వీ భావోద్వేగం

అయోధ్య, జనవరి 22: రామ జన్మ భూమి ఉద్యమంలో పాల్గొన్న హిందుత్వ నాయకురాళ్లు ఉమాభారతి, సాధ్వీ రితంబర సోమవారం అయోధ్య రామాలయ ప్రారంభోత్సవాన్ని కండ్లరా చూసి భావోద్వేగానికి గురై కంట తడి పెట్టారు. ఎన్నో ఏండ్ల హిందువుల కల సాకారమైందని సంతోషం వ్యక్తం చేశారు. ఆలయం ముందు వారిద్దరూ ఉద్విగ్నంగా కనిపించారు.

## నేటి నుంచి భక్తులకు దర్శనం

అయోధ్య, జనవరి 22: అయోధ్య బాలరాముడు నేటి నుంచి(మంగళవారం) సాధారణ భక్తులకు దర్శనం ఇవ్వనున్నాడు. భవిష్యత్తులో దేశంలోనే ప్రముఖ హిందూ పుణ్యక్షేత్రంగా మారే అయోధ్య రామ మందిరంలో రామ్‌లల్లా దర్శనం, హారతి వేళల వివరాలను శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు వెల్లడించింది.

### దర్శనం/హారతి వేళలు

**రామ్‌లల్లా దర్శన సమయం-**
ఉదయం 7.00-11.30
మధ్యాహ్నం 2.00-7.00

**జాగరణ్/శృంగార్ హారతి**
ఉదయం 6.30

**సంధ్యా హారతి**
సాయంత్రం 7.30

**హారతి/దర్శనం పాస్‌లు ఎలా పొందాలి?**

బాలరాముడి దర్శనానికి భక్తులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా పాస్‌లు పొందవచ్చు. అయితే ఆన్‌లైన్ బుకింగ్ ప్రస్తుతానికి ప్రారంభం కాలేదు. అప్‌డేట్స్ కోసం ట్రస్టు అధికారిక వెబ్‌సైట్‌ను చెక్ చేసుకోవాలి.

**ఆన్‌లైన్ బుకింగ్ ఎలా..**

1. అయోధ్య రామాలయ అధికారిక వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి.
2. మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయిన తర్వాత ఓటీపీ ఎంటర్ చేస్తే రిజిస్ట్రేషన్ అవుతుంది.
3. 'మై ప్రొఫైల్' అనే సెక్షన్‌పై క్లిక్ చేసి, హారతి/దర్శన స్లాట్‌ను ఎంపిక చేసుకోవాలి.
4. అవసరమైన వివరాలు సమర్పించి పాస్ బుకింగ్ చేసుకొన్న తర్వాత.. కన్ఫర్మేషన్ మెసేజ్ వస్తుంది.
5. ఆలయం ప్రాంగణంలోని కౌంటర్ వద్ద పాస్ తీసుకొని దర్శనానికి వెళ్లొచ్చు.

**ఆఫ్‌లైన్‌లో ఎలా..**

ఆలయ క్యాంప్ ఆఫీస్‌కు వెళ్లి, చెల్లుబాటు అయ్యే ఏదైనా ప్రభుత్వ ధ్రువీకరణ ఐడీ సమర్పించడం ద్వారా ఆఫ్‌లైన్‌లో పాస్‌లు పొందవచ్చు.

## ప్రతిష్ఠాపనకు అద్వానీ దూరం

న్యూఢిల్లీ: బాలరాముడి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ హాజరు కాలేదు. అయోధ్య రామ మందిర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన అద్వానీ.. ప్రతిష్ఠాపనకు హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. వయోభారం, చలి కారణంగా ప్రారంభోత్సవానికి అద్వానీ వెళ్లలేదని ఆయన సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. అద్వానీ 1990లో రథయాత్ర చేపట్టారు. అంతకుముందు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి అద్వానీని ఆహ్వానించలేదని వార్తలు రావడంతో.. వీహెచ్‌పీ నేతలు ఆయన్ను స్వయంగా కలిసి ఆహ్వాన పత్రం అందజేసిన విషయం తెలిసిందే.

## అయోధ్యకు ఏటా 5 కోట్ల యాత్రికులు!

న్యూఢిల్లీ: రామ మందిర ప్రారంభోత్సవంతో అయోధ్య భారత్‌లో అతి పెద్ద పర్యాటక కేంద్రంగా విరాజిల్లనుందని జెఫరీస్ బ్రోకరేజ్ సంస్థ అంచనా వేసింది. విమానాశ్రయం, ఆధునీకరించిన రైల్వేస్టేషన్, మెరుగైన రోడ్డు మార్గాలు, హోటళ్లు తదితర సౌకర్యాలు కలిగిన అయోధ్య ఏటా 5 కోట్ల పర్యాటకుల్ని ఆకర్షించవచ్చని తెలిపింది. ఏటా 85 వేల కోట్ల ఆదాయం రావొచ్చని తెలిపింది. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని ఏటా 3-3.5 కోట్ల మంది, తిరుపతిని 2.5-3 కోట్ల మంది, వాటికన్ సిటీని 90 లక్షల మంది, మక్కాను 2 కోట్ల మంది సందర్శిస్తుంటారు. అయోధ్యలో 2025 నాటికి 60 లక్షల ప్రయాణికులకు సేవలందించేలా అంతర్జాతీయ టర్మినల్ అందుబాటులోకి రానుంది. భారత పర్యాటకానికి అయోధ్య మరింత ఊపును ఇవ్వనుందని తెలిపింది.



జార్ఖండ్ రాజధాని రాంచీలో ప్రాణ ప్రతిష్ఠ రోజు పుట్టిన బాలలు

## బాల రాముడి ప్రాణప్రతిష్ఠనాడే ప్రసవాలు

### కుమారుడికి రామ్‌రహీమ్ పేరుపెట్టిన ముస్లిం మహిళ

న్యూఢిల్లీ: అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరిగిన సోమవారం నాడే దేశవ్యాప్తంగా అనేక మంది తల్లులు బిడ్డలకు జన్మనిచ్చారు. ఆ శుభముహుర్తంలో బిడ్డను కనాలని సిజేరియన్లకు ప్రాధాన్యం ఇచ్చారు. మధ్యప్రదేశ్ ఇండోర్‌లోని రెండు దవాఖానల్లోనే 15 మంది బిడ్డలకు జన్మనిచ్చారు. 11 మందివి నార్మల్, నలుగురివి సిజేరియన్ డెలివరీలుగా నమోదయ్యాయి. యూపీలోని ఫిరోజాబాద్‌కు చెందిన ఓ ముస్లిం మహిళ మగ బిడ్డకు జన్మనిచ్చింది. అతడికి రామ్‌రహీమ్‌గా నామకరణం చేసింది. మహారాష్ట్రలోని థానేకు చెందిన మహిళ తన డెలివరీ డేట్ మంగళవారం కాగా, డాక్టర్లను అభ్యర్థించి సోమవారం మధ్యాహ్నం 12.30కు ప్రసవించింది.

## విదేశాల్లోనూ వైభవంగా..

### రామనామంతో మార్మోగిన న్యూయార్క్ టైమ్‌స్క్వేర్

వాషింగ్టన్, జనవరి 22: విదేశాల్లోనూ బాలరాముడి ప్రాణప్రతిష్ఠ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమెరికాలోని పలు నగరాల్లో ప్రవాస భారతీయులు ర్యాలీలు నిర్వహించారు. న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్ సహా అమెరికా వ్యాప్తంగా 300 చోట్ల అయోధ్య ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం జరిగింది. కరీబియన్ దేశం ట్రినిడాడ్, టొబాగోలో నిర్వహించిన వేడుకలో 5 వేల మందికిపైగా భారత సంతతి పౌరులు పాల్గొన్నారు. మారిషస్ ప్రభుత్వం హిందూ ఉద్యోగులకు ప్రత్యేకంగా రెండు గంటల సెలవు ప్రకటించింది. 'శ్రీరాముడు తిరిగి అయోధ్యలో కొలువుతీరటం సంతోషదాయకం. ప్రజల శాంతి, శ్రేయస్సుకు శ్రీరాముడి బోధనలు, ఆశీర్వాదం కావాలి. జై హింద్! జై మారిషస్!' అంటూ మారిషస్ ప్రధాని ప్రవింద్ కుమార్ జుగ్నౌత్ 'ఎక్స్'లో సందేశాన్ని పోస్ట్ చేశారు. అమెరికా, కెనడాల్లో 'రామ మందిర యాత్ర'ను చేపడతామని వరల్డ్ హిందూ కౌన్సిల్ ఆఫ్ అమెరికా, విశ్వ హిందూ పరిషత్(కెనడా) సంయుక్తంగా ప్రకటించాయి. 45 రోజులపాటు సాగే ఈ యాత్రలో రెండు దేశాల్లోని దాదాపు 1000కిపైగా ఆలయాల్ని సందర్శిస్తామని తెలిపాయి.

### మెక్సికోలో తొలి రామమందిరం ప్రారంభం

మెక్సికోలో తొలి శ్రీరామ, హనుమ ఆలయాలు క్వెరిటారో నగరంలో వెలిశాయి. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాల్ని వైభవంగా చేపట్టారు. భారత్ నుంచి తెప్పించిన విగ్రహాలకు అమెరికన్ పూజారితో 'ప్రాణ ప్రతిష్ఠ' నిర్వహించారు. ఈ వేడుకల్లో మెక్సికన్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారని మెక్సికోలోని భారత దౌత్యకార్యాలయం 'ఎక్స్'లో తెలిపింది.



న్యూయార్క్‌లోని ప్రముఖ టైమ్స్ స్క్వేర్ వద్ద రాముడి చిత్రాన్ని ప్రదర్శిస్తుండగా వీక్షిస్తున్న ప్రజలు